జలవిద్యుత్ ఉత్పత్తిలో రికార్డు



2



2

ధాన్యం కొనుగోలు కేంద్రాం పరిశీలన

AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in


## జేసీఐ ఇందూరుకు అవార్డుల పంట



**అక్షరటుడే, ఇందూరు:** జేసీఐ ఇందూరుకు పలు అంశాల్లో అవార్డులు వరించాయి. సికింద్రాబాద్‌లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అవార్డులు అందజేశారు. ఉత్తమ పబ్లిక్ రిలేషన్ అవార్డు, ఉత్తమ జోన్ అధికారి, మార్కెటింగ్ అధికారిగా శ్రియా గుప్తా, జేసీఐ ఇందూర్‌కు ఎక్సలెంట్ అవార్డు, ఉత్తమ ట్రైనింగ్ అవార్డు లభించాయి. అవార్డులను అధ్యక్షురాలు గౌతమి డైరెక్టర్ తేజశ్రీ అందుకున్నారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు చంద్రశేఖర్ పాల్గొన్నారు.



## ప్రజావాణికి 128 ఫిర్యాదులు



**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 128 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌తో పాటు డీఆర్డీవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్ రెడ్డిలకు అర్జీలు సమర్పించారు. కాగా.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు.



## ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి: సీపీ


**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సీపీ సాయి చైతన్య సోమవారం ప్రజావాణి నిర్వహించారు. కార్యక్రమానికి 27 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుదారుల సమస్యలను విని.. వాటిని చట్ట ప్రకారం పరిష్కరించాల్సిందిగా సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ పని చేస్తుందని తెలిపారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదులు నేరుగా స్వీకరించేందుకు ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.



## తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి: బాజిరెడ్డి జగన్

**అక్షరటుడే, ఇందల్వాయి:** తడిసిన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్ డిమాండ్ చేశారు. ఇందల్వాయి మండల కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. మొంథా తుపాన్ ప్రభావంతో అకాల వర్షాల కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారని బాజిరెడ్డి జగన్ పేర్కొన్నారు. కొందరు రైతులు పంట నూర్పిడి చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన తర్వాత ధాన్యం తడిసిపోయిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతుల కష్టాలు చూస్తుంటే గుండె తరుక్కుపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చిలువేరి గంగాదాస్, మాజీ ఎంపీటీసీ సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు పాశం కుమార్, సాయిలు, గంగారెడ్డి తదితరులున్నారు.

**బస్సుల్లో ప్రయాణించాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది. పది రోజుల వ్యవధిలోనే ఉమ్మడి రాష్ట్రంలో రెండు బస్సు ప్రమాదాలు జరిగాయి. పదుల సంఖ్యలో ప్రయాణికులు మృతి చెందారు. దీంతో భారీ వాహనాలకు ఫిట్‌నెస్ ఉందా.. నిబంధనలు పాటిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమై గత నెల 24న 19 మంది మృతి చెందారు. తాజాగా రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో సోమవారం ఉదయం ఆర్టీసీ బస్సు, కంకర్ లోడుతో వెళ్తున్న టిప్పర్ ఢీకొని 19 మంది చనిపోయారు. వరుస ప్రమాదాలతో బస్సుల్లో ఎక్కాలంటే ప్రయాణికులు ఆలోచిస్తున్నారు.** – అక్షరటుడే, ఇందూరు



# మన బస్సులు పదిలమేనా !

- వరుస ప్రమాదాలతో ఆందోళన
- బస్సు ఎక్కాలంటే భయపడుతున్న ప్రజలు
- ఫిట్‌నెస్ లేకున్నా రోడ్డెక్కుతున్న ప్రైవేట్ వాహనాలు

జిల్లాలో మొత్తం 540 స్కూల్ బస్సులు, 300 ప్రైవేట్ బస్సులు, 484 ఆర్టీసీ బస్సులు ఉన్నాయి. నిత్యం వేల సంఖ్యలో విద్యార్థులతో పాటు ప్రయాణికులను గమ్యాలకు చేరవేస్తుంటాయి. అయితే ఇటీవల ప్రమాదాల సంఖ్య పెరగడంతో పాటు భారీగా మృతి చెందిన ఘటనలు వెలుగుచూస్తున్నాయి. దీంతో బస్సుల్లో ప్రయాణించాలన్నా భయపడే పరిస్థితి నెలకొంది.

### ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి

ప్రధానంగా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి చేసుకోవాల్సి ఉంటుంది. రవాణా శాఖ అధికారులు ప్రతి సంవత్సరం స్కూల్ బస్సులతో పాటు ప్రైవేటు బస్సులను పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందజేస్తుంటారు. రవాణా శాఖ నిబంధనల ప్రకారం 15 సంవత్సరాలకు మించి బస్సులను వినియోగించకూడదు. కానీ కొందరు స్కూల్ యాజమాన్యాలు, ప్రైవేటు ట్రావెల్స్ యజమానులు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు. ఫిట్‌నెస్ లేకున్నా వాటితో వ్యాపారం చేస్తున్నారు. ఇలాంటి వాటి వల్లే ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అటు అధికారులు సైతం రెగ్యులర్ తనిఖీలు చేయకపోవడంతో ఫిట్‌నెస్ లేని బస్సులు యథేచ్ఛగా రోడ్లపై తిరుగుతున్నాయి.

### స్పీడ్ లిమిట్

మోటారు వాహనాల చట్టం ప్రకారం రాష్ట్రంలోని రోడ్ల పరిస్థితిని బట్టి వాహనాలకు వేగ పరిమితిని నిర్ణయించారు. సాధారణ రోడ్లపై గంటకు 40 కి. మీ, ఎక్స్‌ప్రెస్ వేలపై గంటకు 100 కిలోమీటర్లు, నాలుగు లైన్లు రోడ్లపై గంటకు 90 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించాలని నిర్ణయించారు. అలాగే రోడ్లపై మూలమలుపు, ప్రమాద హెచ్చరికలు, ఇతర కారణాలతో వేగపరిమితి బోర్డులు ఏర్పాటుచేసిన విధంగా వెళ్లాల్సి ఉంటుంది. కానీ 60 శాతానికి పైగా వాహనదారులు నిబంధనలు పాటించడం లేదు. రోడ్లపై వేగ పరిమితికి మించి నడపడం ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయి. దీంతో భారీ మూల్యం చెల్లించక తప్పడం లేదు.

### బస్సులకు లాక్ సిస్టమ్

ఒకప్పుడు ప్రైవేట్ బస్సులు ఫిట్‌నెస్ పరీక్షల కోసం రవాణా శాఖకు వచ్చినప్పుడు అధికారులు స్పీడ్ లాక్ సిస్టం బిగించేవారు. కానీ ప్రస్తుతం బస్సు తయారీదారు కంపెనీలే వాటిని అమర్చుతున్నారు. గంటకు 80 - 100 కి.మీ. వేగం వెళ్లేట్టుగా ఎస్ఎల్ఎస్ (స్పీడ్ లాక్ సిస్టం) ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఆర్టీసీ బస్సులకు ఆర్డినరీకి గంటకు 60 కి.మీ, ఎక్స్‌ప్రెస్ ఆపైన బస్సులకు గంటకు 80 కిలోమీటర్ల వేగం ప్రయాణించేలా లాక్ సిస్టం ఏర్పాటు చేశారు. కానీ కొందరు ప్రైవేటు వాహనదారులు వాటిని తొలగించి నడుపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే కొందరు ఆర్టీసీ డ్రైవర్లు సైతం నిబంధనలను ఉల్లంఘిస్తూ బస్సులను నడుపుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

## ప్రాజెక్టులకు తగ్గని వరద

**అక్షరటుడే, మెండోరా/ఎల్లారెడ్డి:** ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు వరద కొనసాగుతోంది. ఎగువనకురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టుల్లోకి వరద కొనసాగుతోంది. ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల కారణంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌కు వరద వస్తోంది. భారీగా ఇన్‌ఫ్లో వస్తుండడంతో అధికారులు 16 గేట్లు ఎత్తి గోదావరిలోకి విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091 అడుగులు (80.5 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1091.00 అడుగుల (80.501 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

### నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి..

నిజాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. జలాశయంలోకి ప్రస్తుతం 33,910 క్యూసెక్కుల వరద వస్తుండగా.. అధికారులు 5 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. ప్రస్తుతం 1404.62 అడుగుల (17.4 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.


## కలెక్టరేట్‌లో గడ్డిమందు తాగేందుకు యత్నం..



**అక్షరటుడే, ఇందూరు:** తన భూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఓ మహిళ సోమవారం నిజామాబాద్ కలెక్టరేట్‌కు వచ్చింది. తన వెంట గడ్డి మందు తీసుకుని వచ్చింది. ఈ క్రమంలో గడ్డి మందు తాగేందుకు డబ్బాను బ్యాగులో నుంచి బయటకు తీసింది. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది ఆమె గడ్డి మందు తాగకుండా అడ్డుకున్నారు. రూరల్ ఠాణా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆమెను అక్కడి నుంచి తీసుకెళ్లారు. సాలూర మండలం సలంపాడ్‌కు చెందిన బాధితురాలు జయమ్మ మాట్లాడుతూ తనకు రెండెకరాల పొలం, ఇద్దరు కుమారులు ఉన్నారని తెలిపింది. అయితే తన పొలంలోని అర ఎకరం భూమిని తనకు తెలియకుండా చిన్న కుమారుడు విక్రయించాడని వివరించింది. పొలానికి సంబంధించిన పూర్తి పత్రాలు తన వద్ద ఉన్నాయని తనకు న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్, తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా పరిష్కారం కావడం లేదని చెప్పారు. దీంతో మనస్థాపంతో ఆత్మహత్యయత్నానికి పాల్పడినట్లు ఆమె చెప్పింది.

## కార్తీకమాసం సందర్భంగా గోదావరికి పోటెత్తిన భక్తులు





**అక్షరటుడే, మెండోరా:** కార్తీకమాసం సందర్భంగా పవిత్రమైన కార్తీక స్నానాలు చేసేందుకు భక్తులు గోదావరికి పోటెత్తారు. ఈ పవిత్రమాసంలో రెండో సోమవారం సందర్భంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు వద్ద గోదావరి తీరాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారు జామున నుంచే భక్తులు గోదావరి స్నానాల కోసం తరలివచ్చారు. అనంతరం కార్తీక దీపాలను గోదావరిలో వదిలి తమ మొక్కులు తీర్చుకున్నారు. గోమాతలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి తీరమంతా భక్తిమయంగా మారింది. ఈ సందర్భంగా ఎస్సై సుహాసిని మాట్లాడుతూ.. గోదావరి వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున భక్తులు జాగ్రత్తలు పాటించాలన్నారు. నదిలోకి దిగే విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర స్థితిలో మెండోరా పోలీసులను సంప్రదించాలని కోరారు.



## భక్తి శ్రద్ధలతో నింబాచల గిరిప్రదక్షిణ



**అక్షరటుడే, భీమ్‌గల్ :** శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన నింబాచల గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గోవింద నామస్మరణలతో అశేష భక్తజనం మధ్య సోమవారం గిరిప్రదక్షిణ సాగింది. శ్రీవారి ఉత్సవ యాగ సంరక్షణనకు శ్రీచక్ర స్వాముల విగ్రహాలతో నింబాద్రి కొండ ప్రదక్షిణ నిర్వహించారు. ముందుగా పుష్పాలంకృత పల్లకీలో శ్రీచక్ర స్వాముల వారిని గోవింద నామస్మరణతో కొండ ప్రదక్షిణ చేశారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. భీమ్‌గల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో గిరి ప్రదక్షిణకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్సై సందీప్‌తో పాటు సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చూశారు.

## పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నాం: ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



**అక్షరటుడే, లింగంపేట:** కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో పేదవాళ్ల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పేర్కొన్నారు. లింగంపేట మండలంలోని మోతెలో పూర్తయిన మొదటి ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో శివయ్య, జ్యోతి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి పేదోడి కలను నెరవేర్చడమే తన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నారా గౌడ్, నాయకులు సంతోష్ రెడ్డి, రాంరెడ్డి, సాయిరాం యాదవ్, మోహిత్, భైరయ్య తదితరులు పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రాల నిర్వహణలో మహిళలకే ప్రాధాన్యత

**అక్షరటుడే, ఆర్మూర్:** కొనుగోలు కేంద్రాల నిర్వహణలో ప్రభుత్వం మహిళలకే ప్రాధాన్యతనిచ్చిందని ఎంపీడీవో గంగాధర్, ఐకేపీ ఏపీఎం భూమేశ్వర్ పేర్కొన్నారు. ఆలూర్ మండలంలోని గగ్గుపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గంగాధర్ మాట్లాడుతూ మహిళా సంఘాలకు అధిక సంఖ్యలో కొనుగోలు కేంద్రాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఏ గ్రేడ్ రకానికి రూ.2,389, బీ గ్రేడ్ రూ.2,369 ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులు దళారులకు అమ్మవద్దని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషోర్, సీసీ ప్రకాశ్, ఏఈవో వసుధం, మహిళా సంఘాల సభ్యులు, రైతులు పాల్గొన్నారు.



## కామారెడ్డిలో టీఎన్జీవోస్ సభ్యత్వ నమోదు

**అక్షరటుడే, కామారెడ్డి :** జిల్లా వ్యవసాయ శాఖ ఫోరంలో టీఎన్జీవోస్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. వ్యవసాయ శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులు టీఎన్జీవోస్ సభ్యత్వాన్ని తీసుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. 80 ఏళ్ల చరిత్ర కలిగి ఉద్యోగుల సమస్యల పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న టీఎన్జీవోస్ సంఘంలో సభ్యత్వం తీసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి నాగరాజు, కేంద్ర సంఘ బాధ్యులుశివకుమార్, జిల్లా సహ అధ్యక్షుడు చక్రధర్ పాల్గొన్నారు.

## జాతీయస్థాయి ఎస్జీఎఫ్ ఆర్చరీ టోర్నీకి జిల్లా క్రీడాకారిణి



**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని డొంకేశ్వర్ మండలం తొండకూరు గ్రామానికి చెందిన మద్దుల శ్రీనిక ఎస్జీఎఫ్ జాతీయ స్థాయి అండర్-17 ఆర్చరీ టోర్నీకి ఎంపికైంది. మహబూబాబాద్‌లో సోమవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలో సిల్వర్ మెడల్ సాధించి జాతీయ స్థాయికి అర్హత సాధించింది. ఈనెల 27, 28వ తేదీలో జార్ఖండ్‌లోని రాంచీలో జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయి. జాతీయస్థాయికి ఎంపిక కావడంపై ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి నాగమణి, డీవైఎస్‌వో పవన్ కుమార్, జాతీయ క్రీడాకారుడు మురళి హర్షం వ్యక్తం చేశారు.



## భారతజాతి ఐక్యతలో ఉక్కుమనిషి పాత్ర కీలకం

**అక్షరటుడే, ఇందల్వాయి:** భారత జాతి ఐక్యతలో ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర కీలకమని ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త ప్రవీణ్ తాడూరి అన్నారు. వర్సిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త అపర్ణ ఆధ్వర్యంలో పేటల్ జయంతిని నిర్వహించారు. 'జాతి ఐక్యతలో ఉక్కుమనిషి పాత్ర' అనే అంశంపై జిల్లాలోని వివిధ డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ తాడూరి మాట్లాడుతూ.. ఆధునిక ప్రజాస్వామ్య భారతదేశాన్ని నిర్మించిన మహా నాయకుల్లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ప్రముఖుడని పేర్కొన్నారు. దేశ చరిత్రలోనే అత్యంత సంక్లిష్ట సమయంలో సంస్థానాలన్నింటినీ మన జాతీయ జెండా కిందికి పటేల్ చేర్చారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు స్రవంతి, స్వప్న, అలీం ఖాన్, సంపత్, సరిత, సురేష్ పాల్గొన్నారు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలవిద్యుత్ కేంద్రంలో ప్రస్తుత ఆర్థిక (2025-26) సంవత్సరంలో విద్యుదుత్పత్తి లక్ష్యాన్ని అధికారులు పూర్తిచేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 67 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా జల విద్యుత్ సౌదా నిర్ణయించింది. ఆ మేరకు ఉత్పత్తి చేపట్టారు. - అక్షరటుడే, మెండోరా




# జలవిద్యుత్ ఉత్పత్తిలో రికార్డు

- 67 మిలియన్ యూనిట్ల లక్ష్యం
- ఇప్పటివరకు 67.42 మిలియన్ యూనిట్లు పూర్తి
- ఐదు నెలల ముందే టార్గెట్ పూర్తి చేసిన అధికారులు

శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గత 100 రోజుల నుంచి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా భారీగా వరద నీరు వచ్చి చేరింది. దీంతో స్థానిక జల విద్యుత్ కేంద్రంలో నిరంతరం విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది.

### అధికారుల హర్షం

ఈ ఆర్థిక సంవత్సరంలో ఐదు నెలల ముందుగానే విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం చేరుకుంది. దీంతో జలవిద్యుత్ అధికారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాకతీయ కాలువ, ఎస్కేప్ గేట్ల ద్వారా నిరంతరం నీటి విడుదల కొనసాగుతుండడంతో నాలుగు టర్బయిన్ల ద్వారా 36.61 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రబీలో కూడా కాల్వల ద్వారా ఆయకట్టుకు నీటివిడుదల చేపట్టే అవకాశం ఉండడంతో భవిష్యత్తులో మరింత విద్యుత్ ఉత్పత్తి చేపట్టే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఇప్పటి వరకు 67.42 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగిందని జెన్‌కో డీఈ శ్రీనివాస్ తెలిపారు.

### పదేళ్లుగా విద్యుత్ ఉత్పత్తి వివరాలివే..

*2021-22 లో 109.76 మిలియన్ యూనిట్లు, 2022-23 లో138.92 మిలియన్ యూనిట్లు, 2023-24లో 70. 86 మిలియన్ యూనిట్లు 2024-25లో 66.73 మిలియన్ యూనిట్లు, 2025-26 (ఇప్పటి వరకు) 67.42 మిలియన్ యూనిట్లు*

## ఎల్‌వోసీ అందజేత



**అక్షరటుడే, ఆర్మూర్:** మోర్తాడ్ మండలం కేంద్రానికి చెందిన అఫ్రీన్ బేగం ఇటీవల అనారోగ్యానికి గురై నిమ్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఈ విషయాన్ని స్థానిక నాయకులు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే స్పందించి తదుపరి మెరుగైన చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సోమవారం హైదరాబాద్‌లోని నివాసంలో ఎల్‌వోసీని అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు వేములకు కృతజ్ఞతలు తెలిపారు.



## బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** బీసీలకు 42శాతం రిజర్వేషన్లపై కేంద్రం ఏడు నెలలుగా కాలయాపన చేయడం సరైంది కాదని బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ వ్యాఖ్యానించింది. ఈ మేరకు జేఏసీ సభ్యులు కమ్మర్‌పల్లి తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కాంగ్రెస్ సర్కారు కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేసి బీసీ సమాజానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బిల్లును ఆమోదం తెలిపాలని వారు కోరారు. అదేవిధంగా బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.40,000 కోట్లు సంపూర్ణంగా వినియోగించి బీసీలకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వంపరంగా ఉన్న అన్ని నామినేటెడ్ పోస్టుల్లో బీసీలకు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు అశోక్ రజక, గుండోజీ నవీన్ విశ్వకర్మ, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకులు నల్ల కైలాస్, మెరుగు నాగేశ్వర్, గుర్రం సాగర్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి




**అక్షరటుడే, ఇందూరు :** పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు తలపెట్టిన బంద్‌కు ఏఐఎస్ఎఫ్, ఏఐపీఎస్‌యూ మద్దతు తెలుపుతూ నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐపీఎస్‌యూ జిల్లా కార్యదర్శి అనిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా రూ. 8,500 కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోతే ప్రైవేటు యాజమాన్యాలతో కలిసి విద్యార్థి సంఘాలు ఉద్యమాలను తీవ్రం చేస్తాయని హెచ్చరించారు. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు వెళ్లాలంటే ప్రైవేట్ కళాశాలలో సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కనీసం విడతల వారీగా అయినా బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని ఇప్పటికీ నియమించకపోవడం సిగ్గుచేటన్నారు.

## గురునానక్ బోధనలతో ముందుకు సాగాలి

**అక్షరటుడే, ఇందూరు:** గురునానక్ బోధనలను గుర్తు చేసుకుంటూ ముందుకు సాగాలని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా గౌరవ అధ్యక్షుడు కృపాల్‌సింగ్ అన్నారు. ఈనెల 5న గురునానక్ జయంతి పురస్కరించుకొని నగరంలోని కంఠేశ్వర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వమత సమానత్వమే మానవత్వమని గురునాన బోధించినట్లు గుర్తు చేశారు. ప్రతిఒక్కరూ కరుణ, దయ, క్షమాగుణం పెంపొందించుకోవాలని, నిరుపేదలకు సేవ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయిబాబా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## అంకాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లను అమ్ముకున్నారు..




**అక్షరటుడే, ఆర్మూర్:** అంకాపూర్‌లో ఇందిరమ్మ ఇళ్లలో అక్రమాలు చోటు చేసుకున్నాయని ప్రజాపంథా ఉమ్మడిజిల్లా కార్యదర్శి ప్రభాకర్ ఆరోపించారు. అర్హులకే డబుల్ బెడ్ రూం ఇళ్లను ఇవ్వాలనే డిమాండ్‌తో సీపీఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ సబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీపై ఒత్తిడి తెచ్చి అంకాపూర్‌లో అర్హులకే డబుల్ ఇళ్లు ఇప్పిస్తామని ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడారన్నారు. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇళ్లు ఇవ్వకపోతే తన సొంత నిధులతో ఇళ్లు కట్టిస్తానని మాటిచ్చారన్నారు. కాని అంకాపూర్‌లో పేదలకు కాకుండా ప్రభుత్వ ఉద్యోగులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించడం ఎంత వరకు సబబని వారు ప్రశ్నించారు. వెంటనే అర్హులకు ఇళ్లు కేటాయించేలా ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు దేవరాం, పోశెట్టి, గంగారం, ఇస్తారి, రాజమణి, యశోద, భూమిని నరసయ్య, రాజు, భోజన్న, సీపీఎంఎల్ మాస్‌లైన్ సబ్ డివిజన్ కార్యదర్శి కిషన్, ఎం ముత్తన్న, సబ్ డివిజన్ నాయకులు

## ఇందిరమ్మ ఇంటికి ఫైన్ వేసిన విద్యుత్ శాఖ..



**అక్షరటుడే, కామారెడ్డి:** ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇందిరమ్మ ఇంటికి నిర్మించుకుంటే ఆ ఇంటికి ఫైన్ కట్టాలని పేర్కొంటూ విద్యుత్‌శాఖ నోటీసు పంపింది. దీంతో అవాక్కయిన బాధితుడు కామారెడ్డి కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేశాడు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. గాంధారి మండలం ముదెల్లి గ్రామానికి చెందిన వడ్నాల హన్మాండ్లు అతని భార్య నిరీష పేరున ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా.. పాత ఇంటిని కూల్చేసి కొత్త ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఇప్పటికే స్లాబ్ లెవల్ వరకు ఇల్లు పూర్తి కాగా రెండు బిల్లులు కూడా వచ్చాయి. అయితే నెల రోజుల క్రితం గ్రామానికి వచ్చిన విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు హన్మాండ్లు ఇంటికి వచ్చారు. ఇంటి నిర్మాణానికి అక్రమంగా విద్యుత్ వాడుకుంటున్నారని కేసు నమోదు చేస్తామని చెప్పారు. పాత ఇంటికి తన తల్లి సత్తవ్వ పేరున ఉన్న విద్యుత్ మీటర్‌ను ఇందిరమ్మ ఇంటికి బిగించి విద్యుత్ వాడుకుంటున్నానని బాధితుడు తెలిపాడు. అయితే ఆ మీటర్ చెల్లదని, కేటగిరీ-2 కింద కొత్త మీటర్ తీసుకోవాలని లేకపోతే తమకు రూ.10వేలు ఇస్తే కేసు లేకుండా చూస్తామని విద్యుత్ సిబ్బంది చెప్పారని బాధితుడు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇంటికి ఉచిత మీటర్ ఉంటుందని చెప్పినా వినిపించుకోకుండా రూ.10వేలు ఇవ్వకపోవడంతో రూ.7,851 జరిమానా విధించారని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని ఆయన ప్రజావాణిలో వేడుకున్నాడు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన వ్యవసాయ కమిషన్ సభ్యుడు

**అక్షరటుడే, ఆర్మూర్:** మాక్లూర్ మండల కేంద్రంలో సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సోమవారం పరిశీలించారు. రైతుల నుంచి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. ఇటీవల కురిసిన వర్షానికి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. తడిసిన ధాన్యం విషయమై రైతులు ఆందోళనకు గురి కావద్దని గడుగు గంగాధర్ అన్నారు. ప్రభుత్వపరంగా మద్దతు ధర చెల్లిస్తూ కొనుగోలు చేయడం జరుగుతుందని భరోసా కల్పించారు. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకున్నామని అదనపు కలెక్టర్ తెలిపారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసిపోకుండా ఎక్కువ సంఖ్యలో టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా సాగేలా కృషి చేయాలన్నారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీల్లో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని ఆదేశించారు. వారి వెంట సివిల్ సప్లయ్స్ డీఎం శ్రీకాంత్ రెడ్డి, డీఎస్‌వో అరవింద్ రెడ్డి, డీసీవో శ్రీనివాస్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, తహశీల్దార్ శేఖర్ తదితరులున్నారు.



## బీసీలపై చిన్నచూపు.. : చిరంజీవులు



**అక్షరటుడే, కామారెడ్డి:** రాజకీయ పార్టీలు బీసీలను చిన్నచూపు చూస్తున్నాయని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ కలెక్టర్ చిరంజీవులు అన్నారు. కామారెడ్డి పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌లో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కామారెడ్డిలో ఈ నెల 15న బీసీ సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ ప్రకటించిందని గుర్తు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని చెప్పడంతో పాటు ఇతర హామీలను కూడా ఇచ్చిందన్నారు. ఆ హామీల అమలు ఎందుకు చేయలేకపోతున్నారో సదస్సు ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఈ సదస్సులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కొడంగల్‌లో ముగింపు సదస్సు నిర్వహిస్తామని చెప్పారు. హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజల్లో చైతన్యం తేవడానికి ఈ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ ఛైర్మన్ విశారదన్ మహరాజ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ బాలరాజ్ గౌడ్, బీసీ సమాఖ్య అధ్యక్షుడు దుర్గయ్య గౌడ్, గౌడ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్, ఇతర నాయకులు పాల్గొన్నారు.



## స్వాముల పాదయాత్ర ఆధ్యాత్మికతకు ప్రతీక

**అక్షరటుడే, బాన్సువాడ:** అయ్యప్ప స్వాముల పాదయాత్ర ఆధ్యాత్మికతకు ప్రతీక అని ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలో అయ్యప్ప స్వాముల పాదయాత్రను ఆగ్రో ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ముందుగా అయ్యప్ప స్వామి ఆలయంలో సోమవారం ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేకపూజలు నిర్వహించారు. బాన్సువాడ నుంచి శబరిమలకు పాదయాత్రగా బయలుదేరిన అయ్యప్ప స్వాముల బృందాన్ని అభినందించారు. కార్యక్రమంలో ఒడ్డెర సంఘం జాతీయ అధ్యక్షుడు పిట్ల శ్రీధర్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ జంగం గంగాధర్, గురు వినయ్, నార్ల సురేష్, ఎజాజ్, గురుస్వాములు పాల్గొన్నారు.